# అర్చన
# (సంగీత నృత్య నాటకం)

## పాత్రలు

| | | |
|---|---|---|
| అర్చన | : | బాలిక (10 సం॥ లు) |
| రాఘవ | : | నాట్యాచార్యుడు (30 సం॥ లు) |
| సీతమ్మ | : | అర్చన తల్లి (30 సం॥ లు) |
| డాక్టర్ | : | |
| త్యాగయ్య | : | ప్రసిద్ధ వాగ్గేయకారుడు (60 సం॥ లు) |
| శ్రీరాముడు | : | |
| లక్ష్మణుడు | : | |
| సీత | : | |
| హనుమంతుడు | : | |
| పుండరీకుడు | : | మహాభక్తుడు (30 సం॥ లు) |
| తండ్రి | : | పుండరీకుడు తండ్రి (60 సం॥ లు) |
| కృష్ణుడు | : | నందనందనుడు (12 సం॥ లు) |
| చైతన్య మహాప్రభువు | : | భక్తుడు (40 సం॥ లు) |
| వ్యక్తి | : | |
| అంధుడు | : | 40 సం॥ లు |
| కుంటివాడు | : | 40 సం॥ లు |
| మూగవాడు | : | 40 సం॥ లు |
| అర్చన తండ్రి | : | 35 సం॥ లు |

## నృత్యాలు

1. పుడమి పైన పురుషోత్తముడు
2. బ్రోవ భారమా రఘురామ (త్యాగరాజు శోక్లం)
3. గాయతి వనమాలీ!
4. నందలాలా హే కృష్ణామురారి
5. అందుకో మా ప్రణతులు
6. శతకోటి నమన సాయిరాం

# అర్చన
# (సంగీత నృత్య రూపకం)

రచన: **యం.యస్.ప్రకాశరావు**

నృత్య దర్శకత్వం: **వెంపటి రవిశంకర్**

(అర్చన తన తోటి పిల్లలతో కలసి అందంగా నృత్యం చేస్తూ ఉంటుంది. ఆమె గురువుగారు రాఘవ ఆ నృత్యాన్ని పర్యవేక్షిస్తూ ఉంటాడు)

పల్లవి : పుడమి పైన పురుషోత్తము డవతరించినాడు
పుట్టపర్తి పుణ్యక్షేత్రమై వెలసెను ఈనాడు
ప్రేమామృతధారతో జగతిద్ధరింపగా
సత్య ధర్మ శాంతి ప్రేమ దివ్వెలు వెలిగించగా

॥పుడమి॥

చ.1 : శాంతి లేక క్రాంతి రాక ధనమోహం వీడలేక
సన్మార్గం బోధించే సద్గురువులు కానరాక
మనసులోని మాత్సర్యపు పొరలను తొలగించలేక
పరితపించు మానవాళి చేయిపట్టి నడిపించగ

॥పుడమి॥

చ.2 : హరినామస్మరణమే సుఖశాంతులు కూర్చునని
హరిభజనే మనసులోన ఆనందంనింపునని
నారాయణా నారాయణా నారాయణా సాయినారాయణా
శ్రీహరి సంకీర్తనమే ముక్తికి సోపానమని
ధరణి జనులకెల్ల దైవభక్తి పథము చూపగా

॥పుడమి॥

రాఘవ : (చప్పట్లు కొడుతూ) శభాష్ అర్చనా! చాలా చక్కగా నృత్యం చేసేవమ్మా. మీ నృత్యం భగవంతుడికి అందమైన పూలతో అర్చన చేసినట్టుంది. భావం ఒలికించే ఏ కళ అయినా భక్తుణ్ణి భగవంతుడి దగ్గరకు చేరుస్తుందమ్మా.

అర్చన : నేనిచ్చే ఈ చిన్న పువ్వు స్వామి స్వీకరిస్తారా అంకుల్

రాఘవ : సర్వప్రపంచాన్నీ సంరక్షించే సత్యసాయిప్రభువు ఈ చిన్న బిడ్డని మరచిపోతాడా?

అర్చన : మరిచిపోడు అంకుల్. ఒకసారి పెద్దలంతా పూల దండలు పట్టుకుని నిలబడితే

ఒక చిన్నపిల్లవాడిచ్చిన గడ్డిపువ్వుని స్వామి అందుకున్నారని విన్నాను.

రాఘవ : నిజమే, మనస్వామి కోరేది ఆర్తిగాని ఆడంబరాలు కాదమ్మా.

సీతమ్మ : అర్చనా! మీ స్నేహితుల్ని పంపించి రామ్మా

అర్చన : అలాగే అమ్మా

సీతమ్మ : రాఘవా! నా బిడ్డ పరిస్థితి తలుచుకుంటే నా గుండె తరుక్కుపోతోంది. బాబా ఏం చెయ్యదలుచుకున్నారో.

రాఘవ : చుడక్కా భక్తి, విశ్వాసాలతో బాబా అనుగ్రహం పొందాలి కాని, బాధపడి ఏమిటి సాధిస్తావు

సీతమ్మ : నాకు చాలా భయంగా ఉందయ్యా

రాఘవ : నేనుండగా భయమెందు కని పదేపదే స్వామి చెప్తుంటే విని కూడా భయపడతావెందుకక్కా.

సీతమ్మ : స్వామి తప్పకుండా ఆదుకుంటారంటావా.

రాఘవ : ఒక్క ప్రక్క నాస్వామి సర్వేశ్వరుడు సర్వజగద్రక్షకుడు అని సంకీర్తన చేస్తూ ఇంకా సందేహిస్తున్నావా?

సీతమ్మ : కన్నతల్లిని కదరా

రాఘవ : ఒక్క తల్లిప్రేమను పంచిన నీకే ఆ బిడ్డ మీద అంత మమకారం ఉంటే వేయితల్లుల ప్రేమపంచే బాబాకు ఉండదా అక్కా.

సీతమ్మ : ఉంటుందని తెలుసు రాఘవా. కాని డాక్టర్ల మాటలు వింటుంటే అప్పుడప్పుడూ ధైర్యం సడలిపోతూ ఉంటుంది. అదిగో డాక్టరుగారొచ్చారు.

డాక్టర్ : అర్చనని పెద్ద డాక్టర్లందరూ చూశారు రాఘవా! వారందరి అభిప్రాయం ఒక్కటే అర్చనకి ఆపరేషను చెయ్యక తప్పదు కాని, ఆపరేషను చేస్తే ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు, అందుచేత వేచి చూడాలనుకుంటున్నారు డాక్టర్లంతా.

సీతమ్మ : విన్నావా రాఘవా! ఈ పరిస్థితిలో ధైర్యంగా ఎలా ఉండగలనురా!

రాఘవ : నామాట వినక్కా రావణాసుర సంహార చేసిన శ్రీ రామచంద్రుడు, గోవర్ధన గిరినెత్తిన శ్రీ కృష్ణ పరమాత్మ, మత్స్య, కూర్మ, వరాహ నారసింహాద్యవతారము లెత్తిన స్వామి నాస్వామి అనే అచంచల విశ్వాసాన్ని పెంచుకో, నీ ధైర్యం సడలిపోదు. నిరంతరం 'సాయీ, సాయీ' అనే దివ్యనామాన్ని స్మరించు, నీ విశ్వాసం మరింత ధృఢమవుతుంది.

డాక్టర్ : రాఘవ చెప్పింది నిజం సీతా! ఆ విశ్వాసమే నిన్ను ఆదుకుంటుంది. స్వామి ఆపద్భాంధవుడిలా ఆదుకున్న ఎన్నో సంఘటనలు నేను విన్నాను.

రాఘవ : అదొక్కటేకాదక్కా మన భక్తి విశ్వాశాల్ని ఇతరుల శ్రేయస్సుకు వినియోగించాలి. అందుకే నీ పూజల్నీ భజనల్నీ సేవగా మార్చుకో. అన్నార్తులైన వాళ్ళకింత అన్నం

పెట్టు. చలిలో వణుకుతున్న వారికి ఒక వస్త్రం దానం చెయ్యి, కష్టాలతో బాధపడుతున్న వారికి సహాయం చెయ్యి, కన్నీళ్ళతో అలమటిస్తున్నవారి ఒక్క కన్నీటి బొట్టు తుడుపు. అనారోగ్యంతో సతమతమవుతున్న వారికి ఒక్క ఔషధం కొనియ్యి. స్వామి నిన్నూ నీ బిడ్డనీ తప్పకుండా ఆదుకుంటాడు. త్యాగమే మనల్ని స్వామికి దగ్గర చేస్తుంది.

సీతమ్మ : చిన్నవాడవయినా మంచి మాట చెప్పేవు రాఘవా, ఇన్నాళ్ళూ పూజలు, భజనలు చేస్తే చాలనుకునేదాన్ని.

రాఘవ : చాలదక్కా స్వామి మాటలు ఎన్నో వింటున్నాం, ఎన్ని గ్రహిస్తున్నాం, ఎన్ని ఆచరిస్తున్నిం. ప్రశాంతి నిలయంలో అడుగుపెట్టగానే సత్యసాయి భగవంతుడి పాదస్పర్శతో పునీతమైన పుణ్యభూమిపై అడుగుపెట్టానని భక్తితో ఆనేలకి నమస్కరించాలి. సాయికుల్వంత్ సభా మండపంలో అడుగుపెట్టగానే లక్షలాదిమంది ఆర్తుల్నీ దీనుల్నీ భక్తుల్నీ నా స్వామి ఆదుకున్నది ఈ ప్రదేశంలోనే అని పులకించి పోవాలి. సాయి దర్శనం చేశాను. ప్రేమని తప్ప ద్వేషాన్ని ప్రదర్శించకూడదని నిర్ణయించుకోవాలి. స్వామి బోధనల్లో ఒక్కటైనా ఆచరణలో పెట్టాలి. అప్పుడే స్వామి అనుగ్రహం అనూహ్యంగా అనుభవంలోకి వస్తుంది.

అర్చన : అమ్మా

సీతమ్మ : అర్చనా అంకుల్ కొత్తపాఠం చెప్తారు వినమ్మా. ఆంటీని పంపించివస్తాను. రండి డాక్టరు గారు.

రాఘవ : అర్చనా ఈరోజు

అర్చన : కొత్తపాఠం మీరు చెప్పడం కాదు, నేనే ఒక కొత్త విషయం చెపుతాను వింటారా అంకుల్

రాఘవ : చెప్పమ్మా!

అర్చన : గాభరాపడకండి! మా అమ్మ మీకు చెప్పిన విషయం నాకు తెల్సు.

రాఘవ : ఆం నీకు తెలుసా!

అర్చన : ఆస్పత్రిలో డాక్టర్లు చెబుతుంటే విన్నాను

రాఘవ : మరి నీకు భయం వెయ్యలేదా అర్చనా?

అర్చన : బాబా ఉండగా నాకెందుకు భయం అంకుల్. కాని చిన్న సందేహం మాత్రం ఉంది. ఎప్పుడూ బాబా నా కళ్ళల్లో, మనసులో ఉండాలని ఉంటుంది. దానికి నేనేం చెయ్యాలో చెప్పండంకుల్?

రాఘవ : మంచి మాట అడిగావు. నీకు సులువైన మార్గం చెప్పనా

అర్చన : చెప్పండంకుల్

రాఘవ : తమ భక్తి విశ్వాసాలతో భగవంతుణ్ణి సాక్షాత్కరింపచేసుకున్న మహాభక్తుల

చరిత్రలు, అనుభవాలు చదువు, ఎంతో ఉత్తేజం కలుగుతుంది, మన నమ్మకం గట్టిపడుతుంది చాలు. బాబా నిన్ను కన్నబిడ్డలా ఆదుకుంటారు నీ దగ్గరే ఉంటారు సరేనా.

అర్చన : థాంక్యూ, థాంక్యూ వెరిమచ్

(రాత్రిని సూచించే నేపధ్య సంగీతం "ఉయ్యాలలూపరారె సత్యసాయిని" పాట వినిపిస్తూ ఉంటుంది కలని సూచించే సంగీతం)

అర్చన – శ్లో : శ్రీరామ చరణ పులకాంకితపుణ్యరూపం
శ్రీరామ నామసుధారస పీననిరతం
శ్రీరామ భవ్యచరణార్చిత హృత్సరోజం
శ్రీత్యాగరాజ గురువరం శిరసానమామి

(త్యాగరాజ స్వామి శ్రీరామ పంచాయతనం ముందు పాడుకుంటూ ఉంటాడు)

త్యాగయ్య –
పల్లవి : బ్రోవ భారమా రఘురామ
భువనమెల్ల నీవై నన్నొకని ॥బ్రోవ॥

అనుపల్లవి : శ్రీవాసుదేవ అండకోట్ల
కుక్షిని ఉంచుకోలేదా నన్ను ॥బ్రోవ॥

చ : కలశాంబుధిలో దయతో నమ
రులకై యదిగాక గోపి
కలకై కొండలెత్తలేదా
కరుణాకర త్యాగరాజుని ॥బ్రోవ॥

(శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతంగా త్యాగయ్యకు దర్శనమిస్తాడు)

శ్రీరాముడు : త్యాగయ్య! త్యాగయా!

త్యాగయ్య : (కళ్ళు తెరిచి మహానందంలో) శ్రీరామచంద్రా! దయాసాంద్రా! బ్రహ్మాది దేవతలకు అలభ్యమైన నీ దివ్యమంగళస్వరూపాన్ని దర్శించే మహాద్భాగ్యం కల్పించావా స్వామి. రామా! రామా! అని నీ దివ్య నామాన్ని స్మరిస్తూ, అనుక్షణం నీ దర్శన భాగ్యం కోసం తహతహలాడుతున్న నీ దాసుణ్ణి కరుణించావా స్వామీ.

శ్రీరాముడు : త్యాగయ్యా!లే, తేనెలొలికే కీర్తనల్ని రచించి మృదుమధురంగా పాడి నన్ను ఆనందపరవశుణ్ణి చేసావు. నీ భక్తిప్రపత్తులు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. వచ్చే పుష్యబహుళపంచమి నాడు నీకు మోక్షం ప్రసాదిస్తాను

త్యాగయ్య : నాకు మోక్షమిచ్చి, ఆపాత మధురమూ అనంత దివ్యానంద ప్రదాయకమూ, అయిన నీ నామస్మరణకు దూరం చేస్తావా రామా! నిన్ను నా హృదయంనిండా నింపుకొని నీ దివ్య సుందర నామాన్ని గానంచేస్తుంటే లభించే బ్రహ్మానందం

ఆమోక్షంలో లభిస్తుందా స్వామీ.

రాముడు : మరేదైనా వరంకోరుకో త్యాగయ్యా!

త్యాగయ్య : నిరంతరం నీదివ్య నామాన్ని స్మరించే అదృష్టం కంటే కోరదగినదేముంటుంది స్వామీ. అయినా నీవడగమన్నావు కాబట్టి అడుగుతున్నాను. స్వామీ నీవు నాచే రాయించిన కీర్తనలన్నీ ఇంతవరకూ నేనే పాడుకున్నాను. ఇప్పుడు నా పాట నీనోట వినాలని ఉంది నాకోరిక మన్నించి వినిపిస్తావా రామచంద్రా?

రాముడు : త్యాగయ్యా! నామస్మరణ మహత్యాన్ని జనబాహుళ్యానికి తెలియజెప్పి విశ్వవ్యాప్తంగా వారి చేత దివ్యనామస్మరణ చేయించి తరింపచేసేందుకు అతి త్వరలో నేనే సత్యసాయి నామంతో అవతరిస్తాను. అప్పుడు నీ కోరిక తప్పక మన్నిస్తాను. నీ కీర్తనలు విన్నవారు పరవశించేలా నేను గానం చేస్తాను.

(త్యాగయయ విని పరవశిస్తుండగా శ్రీరాముడు అంతర్ధానమవుతాడు)

త్యాగయ్య : ధన్యోస్మి రామచంద్రా ధన్యోస్మి

అర్చన : త్యాగయ్యా!

త్యాగయ్య : ఏం చిట్టితల్లీ

అర్చన : మీ తీయని గానానికి మైమరచిపోయి శ్రీరామచంద్రుడే సాక్షాత్కరించాడు. నీ భక్తిప్రపతుల్ని చూసి పరవశించిపోయాడు. సత్యసాయిగా అవతరించి తన గానామృతాన్ని వినిపిస్తానని వాగ్దానం చేశాడు. ఇంతటి రామానుగ్రహాన్ని మీరెలా పొందగలాగారు? నాకు చెప్పండి స్వామి.

త్యాగయ్య : అమ్మా అర్చనా! రాముడు నాకందనిచోట ఎక్కడో ఉన్నాడని నేనెప్పుడూ అనుకోలేదు. నా రాముడు నా నట్టింట నడయాడుతున్నాడని భావించాఆను. అందుకే 'మేలుకొలుపు' దగ్గర నుండి 'పవ్వళింపు సేవ' వరకూ నా రాముడికి అన్ని సేవలు చేశాడు. అందుకే నన్ను నా రాముడు కరుణించాడు. నాలాగే నువ్వు కూడా నీ స్వామి పర్తిలోనే ఉన్నాడని అనుకోకు. నీతోనే ఉన్నాడని, నీ చేయిపట్టుకొని నడిపిస్తున్నాడని భావించు కలలోనైనా సాయి నామస్మరణం మరవకు, ఆప్రేమమూర్తి నిన్ను తప్పక ఆదరిస్తాడు, అనుగ్రహిస్తాడు.

అర్చన : చల్లనిమాట చెప్పావు స్వామీ నా నమస్సులందుకోండి.

(నేపధ్య సంగీతం)

పద్యం : పండరి పురమును పావనభూమిగా
కూర్చి పేర్చినట్టి ఘనత పొంది
పాండురంగయని పాటలు పాడిన
పుండరీకనతులు పుణ్యపురుష

(పుండరీకుడు "గాయతి వనమాలీ" పాట పాడుతూ తండ్రికి పాదసేవచేస్తూ

ఉంటాడు)

పల్లవి : గాయతివనమాలీ! మధురం గాయతి వనమాలీ!

చ. 1 : పుష్పసుగంధ సుమలయసమీరే
మునిజనసేవిత యమునాతీరే ॥గాయతి॥

చ. 2 : పరమహింస హృదయోత్సవకారీ
పర్తిపూరిత మురళీరధారీ ॥గాయతి॥

కృష్ణుడు : పుండరీకా! పుండరీకా!

పుండరీకుడు : ఎవరు స్వామీ!

కృష్ణుడు : నేనే నందకుమారుణ్ణి! నవనీతచోరుణ్ణి, నువ్వు పిలిచావుగా, అందుకేవచ్చాను!

పుండరీకుడు : స్వామీ ఎంతకరుణామూర్తిని నాకోసం వచ్చావా

కృష్ణుడు : నీ కోసమే వచ్చాను పుండరీకా! నా దివ్యమంగళస్వరూపాన్ని దర్శిద్దువుగాని రా. రావయ్యా పుండరీకా!

పుండరీకుడు : కాస్త మెల్లగా మాట్లాడు స్వామీ! నాన్నగారికి నిద్రాభంగం అవుతుంది.

కృష్ణుడు : నాన్నగారి సంగతి తరువాత చూసుకో, నీకు దర్శనం ఇచ్చి నేను త్వరగా వెళ్ళాలి.

పుండరీకుడు : పితృభక్తి పరాయణుడవే స్వామీ, నాన్నగారి సేవ వదలి రమ్మనటం నీకు భావ్యమేనా?

కృష్ణుడు : అయితే నేను లోపలికి రానా!

పుండరీకుడు : వద్దు స్వామీ నీ సమ్మోహనరూపం చేడగానే నేను మైమరచిపోయి నాన్నగారి సేవ విడిచిపెడతాను. కొంచెంసేపు ఆ ఇటుక రాయిపై వేచి ఉండు స్వామీ. నాన్నగారికి నిద్రపట్టగానే నేనే వస్తాను.

కృష్ణుడు : సరే! భక్తుడు కోరితే తప్పుతుందా మరి, ఈ ఇటుక రాయిపైనే నిలబడతా.

పుండరీకుడు : కృష్ణా వాసుదేవా పాహిమాం. ఎంత కరుణామయుడివయ్యా, నా కోసం ఆ మండుటెండలో ఇటుకరాయిపై నిలబడ్డావా స్వామీ?

కృష్ణుడు : బాధపడకు పుండరీకా! భక్తులకోసం బాధలుపడటం ప్రతీ అవతారంలోనూ నాకలవాటే.

పుండరీకుడు : మన్నించు కృష్ణా

పుండ.తండ్రి : నాయనా పుండరీకా! ఎవరితోనయ్యా మాట్లాడుతున్నావు! ఏమిటాకన్నీరు.

పుండరీకుడు : ఏ దేవుని దర్శనం కోసం విశ్వమంతా వేచియుంటుందో ఆ నందకుమారుడు మనయింటికి వస్తే మీకు నిద్రా భంగమవుతుందని ఆరుబయట ఎండలో ఇటుకరాయిపై వేచిఉండమన్నాను నాన్నగారూ! తల్లి యశోద చల్లని ఒడిలో సేదతీరే నా స్వామి ఆ ఎండలో ఎంత బాధపడుతున్నాడో.

పుండ.తండ్రి : ఎంత అపచారం చేశావునాయనా! (ఇటుకరాతిపై పాండురంగ విఠలుని

విగ్రహంచూసి తండ్రీ కొడుకులు ఆశ్చర్యపోయారు)

పుండరీకుడు : కృష్ణా వాసుదేవా! ఎంతపని చేశావు కృష్ణా ఈ రాతిగుండెకు దర్శనమియ్యడానికి వచ్చి శిలవైపోయావా స్వామీ. ఈ పాపిని మన్నించు కృష్ణా.

కృష్ణుడు : (నేపథ్యంలో) బాధపడకు పుండరీకా! ఇది నా సంకల్పం. కలియుగంలో మానవులు తరించటానికీ, దైవసాక్షాత్కారం పొందడానికీ, నామస్మరణకు మించిన సాధన లేదని తెలియజేయడానికీ, నామస్మరణ చేసిన భక్తులననుగ్రహించి, భక్తసులభుడనని నిరూపించుకోడానికీ, పుండరీకవరదుడిగా, పాండురంగడిగా ఈ ఇటుకరాయిపై వెలిశాను. 'పండరిపుర' మనే పేర ఈ క్షేత్రం ప్రసిద్ధమవుతుంది. జనబాహుళ్యం భక్తివిశ్వాసాలు కోల్పోయే తరుణంలో నామస్మరణ విశ్వవ్యాప్తంగా పునరుద్ధరించడానికి నేనే తిరిగి సత్యసాయిగా అవతరిస్తాను. 'పండరి భజన' తోనే తిరిగి నా కార్యక్రమాన్ని ప్రారంభిస్తాను.

పుండరీకుడు : ధన్యోస్మి కృష్ణా

శ్లో॥ : సమచరణ సరోజం సాంద్రనీలాంబుదాభం
జఘన నిహితపాణిం మండనం మండనానాం
తరుణ తులసిమాలా కంథరం కంజనేత్రం
సదయధవళహాసం విఠ్ఠలం చింతయామి
విఠ్ఠలం చింతయామి విఠ్ఠలం చింతయామి

అర్చన : పుండరీకా! పుండరీకా!

పుండరీకుడు : ఏం తల్లీ!

అర్చన : ఎంత అదృష్టవంతుడివయ్యా! నువ్వు గానం చేస్తోంటే పులకించిపోయి భగవంతుడు గోపికాబృందంతో నీ వాకిట రాసలీలా నృత్యం చేశాడు. నువ్వు ఇటుకరాతిపైన నిలబడమంటే నిలబడిపోయాడు. నీపేరు చిరస్థాయిగా నిలవడానికి "పాండురండ" నామం ధరించి ఈ ప్రదేశాన్ని 'పండరిపుర' మనే పుణ్యక్షేత్రంగా అనుగ్రహించి ఆశీర్వదించాడు. భగవంతుడి మీద ఇంత అధికారం ఎలా సంపాదించావయ్యా పుండరీక?

పుండరీకుడు : చూడమ్మా! నేను నా తల్లిదండ్రుల్ని దైవాలుగా భావించి సేవ చేశాను. భగవంతుడు వచ్చితల్లీతండ్రీ అయి ఆదుకుంటాడు. అందుకే నామస్మరణ చేస్తూ తల్లిదండ్రుల సేవచెయ్యి. నీ సాయి నిన్ను తప్పక ఆదరిస్తాడు. తల్లికిచ్చిన మాటకోసం పర్తిసాయి పుట్టపర్తిని ఒక షిరిడిగా, ఒక వారణాసిగా, ఒక తిరుపతిగా మార్చలేదా?

అర్చన : అవును పుండరీక నువ్వు చెప్పింది నిజమే, మా స్వామికి తల్లిదండ్రులంటే ఎనలేని ప్రేమ.

(నేపథ్య సంగీతం)

శ్లో॥ : శ్రీ కృష్ణ కృష్ణేతి నామం జపంతం

శ్రీ కృష్ణ నామం సదా కీర్తయంతం
శ్రీ కృష్ణ చరితం సదా బోధయంతం
శ్రీ కృష్ణ చైతన్య ప్రభుం నమామి

పాట : నందలాలా హే కృష్ణా మురారీ
తేరీ బన్సీ బజారే గిరిధారి
(చైతన్య మహాప్రభువు ఒక అంధుడ్ని తాకితే అతనికి చూపు వస్తుంది. ఒక కుంటి వాడిని తాకితే అతనికి నడక వస్తుంది. ఒక మూగవాడిని తాకితే అతనికి మాట వస్తుంది. అందరూ కరతాళధ్వనులు చేస్తారు. హరేకృష్ణ, హరేకృష్ణ అని గొంతెత్తి పలుకుతారు)

వ్యక్తి : చైతన్య మహాప్రభూ! మీరు మహానుభావులు మీ స్పర్శ చేతనే మూగవాడు పాడగలిగాడు. కుంటివాడు నాట్యం చేశాడు, అంధుడు చూడగలిగాడు.

చైతన్య : అన్నా! మహత్యం నాదికాదు, శ్రీకృష్ణనామ సంకీర్తనది. కృష్ణనామసంకీర్తన చెయ్యి అన్ని దు:ఖాలు సమసిపోతాయి.

అర్చన : స్వామీ చైతన్య మహాప్రభూ!

చైతన్య : ఏం అర్చనా!

అర్చన : నేను మీకు తెలుసా స్వామీ!

చైతన్య : శ్రీ కృష్ణనామాన్ని గానం చేసే వారికి అందరూ బంధువులే అర్చనా.

అర్చన : మీరు కృష్ణనామ సంకీర్తన చేస్తుంటే సాక్షాత్తు ఆ నందనందనుడే వచ్చి నాట్యం చేశాడు. మీ స్పర్శతో అంధుడు చూడగలిగాడు, కుంటివాడు నడవగలిగాడు, మూగవాడు సంకీర్తన చేయగలిగాడు ఈ అద్భుతాలు, అద్భుతాలు ఎలా సాధించారు స్వామి.

చైతన్య : తల్లీ, నేను కేవలం కృష్ణుని చేతిలో బొమ్మని. ఏ అద్భుతం జరిగినా అది సంకీర్తన మహత్యం తప్ప నాది కాదు. దీనులకు సేవచేయాలని సంకల్పం చేసుకో. ఆ సేవ భగవన్నామస్మరణ చేస్తూ చయ్యి అద్భుతాలు జరుగుతాయి. ఎక్కడ నామస్మరణ జరుగుతుందో అక్కడ సాయి కొలువై ఉంటాడు. దీనుల బాధలు పంచుకో. సాయి నీ బాధలు పంచుకుంటాడు. వారి జీవితాల్లో దివ్వెలు వెలిగించు. నీ జీవన జ్యోతికి ఆయన దివ్య ప్రకాశాన్ని అందిస్తాడు.

అర్చన : మీ బోధనతో నాకు జ్ఞానోదయం అయింది. దీనుల సేవచేస్తాను మా స్వామి ఆశీస్సులందుకుంటాను. నన్ను ఆశీర్వదించండి స్వామి.
(నేపథ్య సంగీతం, ఉషోదయం అఉతున్న సంగీతం)

అర్చన : స్వామీ ఎంత ప్రేమమూర్తిని, నాకు కనువిప్పు కలిగించావు. నాకు దారిచూపించావు. ఈ భక్తులు చూపిన మార్గంలె నడుస్తాను. నీ దివ్య

నామస్మరణం చేస్తూ, తల్లిదండ్రులను సేవిస్తూ, దీనుల బాధలను పచుకుంటూ

నీవు నా చేయి పట్టి నడిపిస్తున్నావని భావిస్తూ, నా జీవితాన్ని అర్చనగా నీ పాదాల దగ్గర సమర్పిస్తున్నాను. నాప్రణతులు అందుకో స్వామీ.

**(అర్చన తన బృందంతో నృత్యం చేస్తుంది)**

పాట: అందుకో... మా ప్రణతులు ఆనందసాయి
మాదైవం నీవే ఆనందదాయి
సర్వేస్వరా సత్య సాయిశ్వరా
సర్వేస్వరా సత్యసాయీశ్వరా
అందుకో మా ప్రణతులు ఆనందసాయీ

1. తల్లివై పసిమనసుల ప్రేమలతలు పూయించి
తండ్రివైమానవతా విలువలు జోడించి
గరువువై అజ్ఞాన తిమిరాలు తొలగించి
పసిడి మనసులై విరిసే దీవెనలందించావు
ప్రేస్వరూపా! నీ మనసు నందనం
పర్తీశ్వరా నీకు పాదాభివందనం - 2 ॥అందుకో॥

2. దైవభక్తి మా మనసుల పరిమళింప జేశావు
మాతృభక్తి మాధుర్యం మా ఎదలో నింపావు
దేశభక్తి కణకణమున ప్రవహింపజేసావు
దైవమై మా గుండెను నీ గుడిగా మార్చావు
ప్రతి గడపా ఈనాడొక ప్రేమ మందిరం
ప్రేమ ప్రభలు ప్రసరించే సాయి మందిరం - 2 ॥అందుకో॥

3. నీ ప్రేమ యజ్ఞంలో సమిధల మౌతాం
కులమత విద్వేషాలను రూపుమాపుతాం
విశ్వశాంతి మంత్రానికి అంకిత మవుతాం
సత్యసాయి బోధించిన ప్రేమయుగం సాధిస్తాం
ప్రేమయుగం సాధిస్తాం, ప్రేమయుగం సాధిస్తాం
సాయీశ్వరా నీవె మాకు ప్రాణము
మనసారా నినుకొలిచిన బ్రతుకు ధన్యము ॥అందుకో॥

డాక్టర్ : సీతమ్మా సీతమ్మా కంగ్రాచ్చులేషన్స్
సీతమ్మ : విషయమేమిటి డాక్టర్
డాక్టర్ : నిన్న మీ అమ్మాయికి అన్ని టెస్టులు చేశారా!
సీతమ్మ : ఆ చేశారు.

డాక్టర్ : ఆ టెస్టు రిపోర్టు వచ్చింది ఈరోజు.

సీతమ్మ : నిజమా!

డాక్టర్ : అక్షరాల నిజం ఆ రిపోర్టు ప్రకారం అర్చనకి ఏ గుండె జబ్బు లేదు.

సీతమ్మ : ఆు నిజంగా సాయిరాం

డాక్టర్ : ముమ్మాటికీ నిజం అర్చన సేవలు, నీ పూజలు ఫలించాయి. స్వామి కరుణించారు.

సీతమ్మ : (స్వామి ఫోటో పైన ఉంటుంది) స్వామీ అనంతకరుణా మూర్తివై నా బిడ్డను కాపాడావా తండ్రీ! ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలను స్వామీ. రాఘవా చూశావా. నా బిడ్డని బాబా ఎట్లా కాపాడారో. అర్చనా రా అమ్మ బాబా పాదారవిందాలకు నమస్కారం చెయ్యి నీకు ప్రాణదానం చేసిన స్వామికి మనసారా కృతజ్ఞతలు చెప్పుకో తల్లీ.

అర్చన : స్వామి మాటలురాని చిన్న బిడ్డని, దేవుడికేమివ్వాలో కూడా నాకు తెలియదు. నమ్మినవారిని రక్షిస్తావని కథలు విన్నాను తప్ప కంటికి రెప్పలా కాపాడుతావని ఈరోజే తెలిసింది స్వామీ. కన్నీళ్ళతో నీపాదాలు కడుగుతాను స్వామీ. నా జీవితం నీకే అంకితం చేస్తాను. నీమాటే మంత్రంగా నడుచుకుంటాను. ఎప్పుడు నా చెయ్యివదలకు  స్వామీ.  నీరూపం చూడకుండా నీనామం స్మరించుకుండా నేను ఉండలేను స్వామీ ఉండలేను.

రాఘవ : స్వామీ నిర్మల ప్రేమమూర్తివి. వేయి తల్లుల ప్రేమ పంచి ఇచ్చి, ఈ బిడ్డను కాపాడి నీ రక్షణ పొందడానికి, మా చేయి పట్టి నడిపించటానికి పసిహృదయంలాంటి పసిడి మనసు అశ్రుధాలతో అర్చన అర్హతలని చెప్పి మాకు కనువిప్పు కలిగించావా స్వామీ. ఈ అనుభవంతో మాకు గుణపాఠం చెప్పావా స్వామీ. మీపాదపద్మాలకు శతకోటి వందనాలు స్వామీ. శతకోటి వందనాలు. అక్కా స్వామి మనకిచ్చిన ఆనందాన్ని, ప్రేమనీ అందరికీ పంచుదాం. అందరం కలిసి ముక్తకంఠంతో స్వామిని కీర్తిద్దాం.

పాట : శతకోటి నమన సాయిరాం
సాయిరాం సాయిరాం సాయిరాం
ఇక్‌బార్ కహెూరే సాయిరాం
సాయిరాం సాయిరాం సాయిరాం
హే మంగళ నయనారాం
హే కోటి జీవనాధార్
హే షిరిడీకే భగవాన్
హే ప్రశాంతి నిలయారామ్
శతకోటి నమనసాయిరాం
సాయిరాం సాయిరాం సాయిరాం

+++++